


మరోసారి మీరు సంపాదకీయాన్ని స్పందించేలా వ్రాసారు (అలవాటైపోయింది మీకు!)

భయం నుంచీ నిర్భయం వైపు ఎదుగుతారు మనుషులని నా అభిప్రాయం. ఊహ తెలిసేటప్పటికి అమ్మ ‘అలా చెయ్యకూడదు..ఇలా చెయ్యకూడదు..‘ వగైరా ఆంక్షలతో భయం మొదలౌతుంది. ఐతే యౌవ్వనంలో ఇలాంటి భయాలకి తావివ్వరు చాలా మంది. మళ్ళీ జీవితంలో సంసార బాధ్యతలు మొదలయ్యే సరికి ఈ ‘భయం‘ మొదలౌతుంది. పరిస్థితులని బట్టి వృద్ధాప్యంలో ఈ భయం మరింతగా పెరుగుతుంది. ఐతే ప్రతి భయానికీ ఒక పూర్వాపరం ఉంటుందని అనుకుంటాను. ఈ సందర్భంగా నాకు గుర్తొస్తున్న కొన్ని శ్లోకాలు..

YASYA SNEHO BHAYAM TASYAA, SNEHO DUHKHASYAA BHAAJANAM
SNEHAMULANI DHUKHANI SNEHAM TYAKTVA VASETSUKHAM
The root cause of fear and suffering is attachment. Once you forego attachment, you can gain happiness. (Not necessarily be a saint and be a recluse though!)...

TRAIYAMBAKAM YAJAAMAHE PUSHTIVARDHANAM OORVAARUKA
MIVA BANDHANAATH MRUTHYORMOKSHI YAMAAMTRUTAAT
Stay attached like a watermelon to the string of growth, but be different and (indifferent to the string) as the watermelon is with respect to the string in its identity... that is the true solace.
In other words... Non-attachment is the cure for "bhayam"... !!

*మాన్యాపగడ శాయి*
*శాన్‌హోసె, కాలిఫోర్నియా*

ఎప్పటిలానే ఎదురుచూసిన ముఖచిత్రం మా మనసుల్ని ఆనందడోలల్లో ఊగించింది. మీరు ఎన్నుకున్న చిత్రం ఒక ఎత్తైతే దానికి వ్రాసిన కవిత మరోఎత్తు. బొమ్మ చూస్తాం, కవిత చదువుతాం, మళ్ళీ చూస్తాం, మళ్ళీచదువుతాం..అబ్బా ఎంత బాగా ఇంటర్‌ప్రెట్ చేసారా అని ఆశ్చర్యపోతాం..ఆనందిస్తాం. భావుకతా ప్రపంచంలో తేలిపోతాం..మళ్ళీ నెలలో వచ్చే ముఖచిత్రంకోసం ఎదురుచూస్తూ..

*కొమ్మినేని శ్రీలత , సెంట్రల్ యూనివర్సిటీ*
*హైదరాబాదు*

మార్చినెల ముఖచిత్రాలంకరణ అద్భుతంగా ఉంది. వర్ణ చిత్రానికి పైనా క్రింది అలంకరించిన తెలుపు-నలుపుల సూక్ష్మ చిత్రా మాలిక కొత్త అందాల్ని సంతరించి పెట్టింది. కీపిట్ అప్..!

*పరిమి సహదేవుడు*
*ఇంగ్లాండు, యు.కె*

సీరియల్స్ అన్నీ ఒకదానికొకటి పోటీ పడి సాగుతున్నాయి. మల్లాదిగారి సీరియల్ అతి సులభమైన శైలిలో సాగుతూ దృశ్యాలని కళ్ళముందు కదిలిస్తోంది. మూడు దశాబ్దాలక్రిందటి ఒక తెలుగు కుటుంబాన్ని మళ్ళీ చూస్తున్నాం. ఇప్పటి హడావిడీ , గందరగోళం లేని రోజుల్లో మనుషులమధ్య ఉండే సంబంధ, బాంధవ్యాలకి అద్దం పడుతోంది ఈ కథ. ఏ భాగంలో ఏ మలుపు తిప్పుతారో నని ఊపిరి బిగపట్టుకుని ఎదురుచూస్తున్నాం.

*న్రరా సుపియా మూర్తి*
*లావోస్, నైజీరియా*

నిషిగంధ గారి సీరియల్ నిజంగా ఇప్పుడే వ్రాస్తున్నారా? లేక 20 సంవత్సరాల క్రిందట వ్రాసిందా? వాతావరణం, పరిసరాల వర్ణన మా వూరి మీద బెంగ పుట్టిస్తున్నాయి.

*కె.వి.ఎస్.రమణారెడ్డి*
*వేన్ స్టేట్ యూనివర్సిటీ, డిట్రాయిట్ ( విజయవాడ స్వస్థలం)*

*నిషిగంధ గారు ఈ సీరియల్ ని ఏనెలకానెల వ్రాస్తున్నారు. ఇదే ప్రథమ ప్రచురణ. కథాకాలం మాత్రమే 20 సంవత్సరాల క్రిందటిది*

*సంపాదకుడు*

నిషి గంధ గారి సీరియల్ చదువుతుంటే అప్పటి కలంస్నేహాలు ఎలా వుండేవో అనిపిస్తోంది. ఇ-మెయిల్స్ వచ్చేసి ఆనాటి ఎదురుచూపుల్నీ, సున్నితత్వాన్నీ మింగేశాయి కదా. నేను చదువుకునే రోజుల్లో కూడా ఇలానే కొంతమందికి ఉత్తరాలు వ్రాసేదాన్ని. రోజూ పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూడ్డం ఎంత థ్రిల్లింగ్ గా వుండేదో..! మళ్ళీ గతాన్ని మా అందంగా మా ముందుకి తెస్తున్న నిషి గారికి అభినందనలు. ఇంతకీ వివాహితుడైన వంశీకి, కార్తీకకి మధ్య ఏం జరగబోతోంది..!?

*రేబాల శిరీష కుసుమ*
*తెనాలి*

పొన్నాడ కుమార్ గారి కథ అనూహ్యంగా సాగి మమ్మల్ని కట్టుకుంది. మనుషుల్లో మానవత్వం తొంగిచూస్తే జీవితాలు ఎంతలా ప్రకాశిస్తాయో బాగా వ్రాసారు. ఇలాంటివి చదివినప్పుడు అనిపిస్తుంది, మనుషులంతా ఇంత గొప్ప మనసున్న వాళ్ళైతే సమాజం ఎంత బావుంటుందో కదా అని. వాస్తవంలో చూడలేకపోయినా కనీసం కథల్లోనైనా ఇలాంటి వ్యక్తుల్ని చూసినప్పుడు మనసు చెమ్మగిల్లుతుంది.

*ఎల్.బి.సత్యానందం*
*వాంకూవర్, కెనడా*

మనకవెన్నెల కథ బాగా సాగింది కానీ ముగింపులో రచయిత చెప్పదలచుకున్నదేమిటో స్పష్టంగా లేదు. మా అవగాహనా లోపమా లేక రచయిత అస్పష్టతా లేక ఇదో రకం శైలా?

*తమ్మన వెంకటేశ్వర రావు*

*విజయవాడ*

'దూకితే దూకండి ' కథ మమ్మల్ని ఆద్యంతం నవ్వించింది. సమకాలీన సమస్యలకి మంచి పరిష్కారమే చూపించారు రచయిత. నిజంగానే రోజూ న్యూస్ పేపర్ తెరిస్తే ఎన్ని అపరిపక్వ ప్రేమ కథలో.! ఆహ్లాదకరమైన హాస్యంతో బాటు ఆలోచనని కూడా జతచేసిన రచయిత వారణాసి గారిని అభినందిస్తున్నాం.

*మల్లవోలు సుబ్బరామయ్య*

*రేలీ, నార్త్ కరోలినా*

మీరు అందిస్తున్న కథల మిక్స్ బావుంటోంది. ఆలోచింపచేస్తున్నారు..అయ్యారే ఏం కథా శిల్పం అనిపిస్తున్నారు, అంతలోనే గలగలా నవ్విస్తున్నారు..ఒక్కసారి గతంలోకి తొంగిచూసే అవకాశం కలిపిస్తున్నారు. అనగనగా ఒక మంచి కథలు మేము అప్పుడెప్పుడో మిస్సయిన వాటిని మా ముందుకి తెస్తున్నాయి. మీ కృషికి హేట్సాఫ్..

*శుద్ధపల్లి శ్రీనివాస శాస్త్రి*

*ఆస్ట్రేలియా*

ఈ నెల 'అ'సామాన్యులు మమ్మల్ని చాలా ఆలోచింపచేసింది. నిన్ననో మొన్ననో ఈనాడు దినపత్రికలో ఒక వార్త చదివాము 'రైతు రాజీనామా' అనే హెడ్డింగ్ తో. యువకులెవరూ వ్యవసాయం వైపు మొగ్గు చూపడంలేదనీ. ఇలా ఐతే రైతు వ్యవస్థ ఏమౌతుందోనని ఒక విశ్లేషణ వ్రాసారు. అలాంటి పరిస్థితుల్లో విద్యాధికుడైన నాగరత్నం నాయుడు గారి విజయ గాధ చదువుతుంటే ఇది నిజమా అనిపించేట్లుంది. మనసులో దీక్ష, కష్టించే మనస్తత్వం, పట్టుదల ఉంటే ఎవరైనా,అక్కడైనా నందనవనాల్ని సృష్టించుకోవచ్చు ననడానికి నాగరత్నం నాయుడు కథే నిదర్శనం.. రమేష్ బాబు గారు మరోసారి తన పరిశోధనాత్మక జర్నలిజంతో మా మనసుల్ని ఆకట్టుకున్నారు.

*మల్లంపల్లి శేఖర్ బాబు*

*రాంచో కార్డోవా, కాలిఫోర్నియా*

దాదాపు ఇంతవరకూ మీరు రాసిన 'మొదటి సినిమా' అనుభవాల్లో అందరూ చిన్నప్పటినుంచీ సినిమాలంటే ఎంత పిచ్చి ఉండేదో చెప్పిన వాళ్ళే. బహుశా ఈ నెల మీరు పరిచయం చేసిన బోయపాటి శీను గారొక్కరే చిన్నప్పుడు అస్సలు సినిమాలు చూడలేదనీ, సినిమాలంటే అస్సలు ఆసక్తి లేదనీ చెప్పన వారు... మెచ్చుకోదగ్గ వ్యక్తిత్వం..!

*ఎం. లీలావతి*

*మినియాపోలిస్*

సినిమా రంగంపై నాటక రంగ ప్రభావం - వ్యాసం మారుతీరావు గారి అనుభవాలకి దర్పణం. చక్కటి వాస్తవాల విశ్లేషణ. చాలా కొత్త విషయాలు తెలుసుకున్నాము.

*ఎస్.ఎస్.వి*
*న్యూఢిల్లీ*

నన్నపునేని మోహన్ గారి 'మామంచి మాస్టారు' అద్భుతంగా సాగింది. ఇద్దరూ పేరున్న వ్యక్తులే. వారిద్దరూ ఒకప్పటి గురు శిష్యులు కావడం ఆశ్చర్యకరంగా ఉంది. మోహన్ గారు వ్రాసిన చివరి వాక్యం మనసుని కదిలించేసింది.

*టి.ఎల్.సత్యవతి, అట్లాంటా*
*చలసాని మోహన ప్రసాద్, లూజియానా*
*ఎన్.పద్మాదీక్షిత్, హ్యూస్టన్*
*నంగునూరి ప్రసాద్ బాబు, ఒహాయో*